క్లుప్తంగా

ధ్వజస్తంభానికి ప్రాణప్రతిష్ఠ



శివాలయంలో ధ్వజస్తంభానికి ప్రాణప్రతిష్ఠ చేస్తున్న వేద పండితులు

పుంగనూరు: పట్టణంలోని శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో నూతనంగా ప్రతిష్ఠించిన ధ్వజస్తభానికి సోమవారం ప్రాణప్రతిష్ఠ చేశారు. ఆలయ అర్చకులు బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో ధ్వజస్తంభాన్ని శుద్ధి చేసి, గణపతి, స్వస్తివాచన, కలశ స్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మహోత్సవాలు ఈనెల 25 వరకు నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు.

జ్వర పీడితులకు వార్డు ఏర్పాటు

పుంగనూరు: జ్వరాల బారిన పడి ఆసుపత్రికి వచ్చే వారి కోసం ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసినట్లు ఏరియా ఆసుపత్రి మెడికలాఫీసర్ డాక్టర్ మధుసూదనాచారి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం మారిన వాతావరణం మూలాన జ్వర పీడితుల సంఖ్య పెరిగిందని, దీనిని దృష్టిలో ఉంచుకుని మలేరియా, డెంగీ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. జ్వరం, జలుబు, దగ్గు లక్షణాలతో బాధపడుతున్న వారు ఆలస్యం చేయకుండా ఆస్పత్రుల్లో వైద్య పరీక్షలు చేసుకుని చికిత్స పొందాలని కోరారు.

ఘనంగా సపోజ్ క్రిస్మస్ వేడుకలు

కుప్పం: పట్టణంలోని టైలర్ హైస్కూల్‌లో సోమవారం సపోజ్ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. పాఠశాలలో కులమతాలకు అతీతంగా ఈ వేడుకలను నిర్వహించారు. పాఠశాల ప్రాంగణాన్ని అలంకరించి క్రిస్మస్ తాత వేషధారణతో ఆకట్టుకున్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు సంబరాల్లో పాల్గొని కేక్‌ను కట్ చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు డాక్టర్ సురేష్ బాబు, సుదర్శన్, రూబి, తౌసిక్, ప్రమోద్, అహ్మద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ రామచంద్రయ్య మృతి



రామచంద్రయ్య (ఫైల్)

చౌడేపల్లె: విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్(చిన్న పీఈటీ మాస్టర్)గా పిలిచే రామచంద్రయ్య (92) సోమవారం మృతి చెందారు. ఈయన స్థానిక ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా సుమారు 20 ఏళ్ల పాటు పనిచేశారు. కర్ణాటక రాష్ట్రం బాగేపల్లెలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు రామచంద్రయ్య కుటుంబ సభ్యులు చెప్పారు. ఎంతో మంది క్రీడాకారులను తీర్చిదిద్దడంతోపాటు విద్యార్థుల క్రమశిక్షణలో కీలకంగా వ్యవహరించేవాడని పూర్వ విద్యార్థులు చెప్పారు. ఆయన మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

ఐఎంఏ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా డాక్టర్ యుగంధర్



డాక్టర్ యుగంధర్

పలమనేరు: ఏపీ ఇండియన్ మెడికల్స్ అసోసియేషన్ స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యుడిగా పలమనేరు ఏరియా ఆస్పత్రికి చెందిన డాక్టర్ యుగంధర్ నియమితులయ్యారు. రెండేళ్లుగా ఆయన ఐఎంఏలో సేవలందించారు. దీన్ని గుర్తించిన అసోసియేషన్ పెద్దలు ఆయనకు ఈ పదవిని కట్టబెట్టారు. పలువురు వైద్యులు, స్థానిక ప్రజలు ఆయన్ను అభినందించారు.

నారు.. నకిలీ అయితే బేజారు

- ముందుగానే రిజర్వు చేసుకుంటున్న టమాట రైతులు
- నకిలీ విత్తనాల నారుతో నష్టపోయే ప్రమాదం
- పట్టించుకోని అధికారులు



చౌడేపల్లెలో నర్సరీలలో పెంచుతున్న టమాట నారు

చౌడేపల్లె: టమాట పంటకు గత ఏడాది ధరలు ఆశాజనకంగా ఉండడంతో ఈ ఏడాది కూడా ధరలు ఉంటాయని ఆశతో రైతులు టమాట సాగుపై ఆసక్తి చూపుతున్నారు. సీజనులో ఆరుతడి పంటల సాగులో ఇతర పంటల కంటే టమాట సాగుపై పడమటి ప్రాంత రైతులు దృష్టి సారించారు. ప్రస్తుతం టమాట ధర పడిపోయినప్పటికీ రాబోయే మూడు నెలల్లో దశల వారీగా పంట సీజను కావడంతో ధర ఉండవచ్చని నర్సరీ నిర్వాహకులు విత్తనాలు విత్తి మొలకల సస్యరక్షణపై శ్రద్ధ వహించారు. తక్కువ నీటి సౌకర్యం ఉన్న రైతు కూడా అధిక దిగుబడులు పొందడానికి మార్కెట్లలో విడుదలైన కొత్తరకం విత్తనాలపై మొగ్గు చూపుతున్నారు. నర్సరీలో ప్రస్తుతం సాహో, సల్లార్, కావేరి, 778లతోపాటు కొత్తరం టమాట నార్లను విక్రయిస్తున్నారు. వర్షాలు కురవడంతో రైతులు టమాట పంట సాగుపై ఉత్సాహం చూపడంతో ఇటీవల టమాట నార్లకు డిమాండు నెలకొంది. టమాట మొలకల కోసం రైతులు ముందుగానే నర్సరీ యజమానుల వద్ద ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. ఒక్కొక్క టమాట మొలకను రూ.1.20 పైసల నుంచి రూ.2 వరకు విక్రయిస్తున్నట్టు నర్సరీ యజమానులు చెప్పారు. నారు పెంచడానికి సుమారు 27 రోజులు సమయం పడుతుంది. ఎకరం పొలానికి రూ.7 వేల నుంచి రూ.8 వేల నారు అవసరం ఉంటుంది. ప్రస్తుతం మొలకలకు ఉన్న డిమాండు దృష్టిలో ఉంచుకుని వ్యాపారులు బయట ప్రాంతం నుంచి నారును సరఫరా చేస్తున్నారు. దీంతో నకిలీ విత్తనాలతో తయారు చేసిన నారు విక్రయాలు కూడా జోరుగా సాగుతున్నాయని సమాచారం.

నకిలీ నారుతో నష్టపోయిన రైతు

రెండేళ్ల క్రితం మండలంలోని కాగతి పంచాయతీలో ఒక రైతు 2 ఎకరాల్లో టమాట సాగు చేశాడు. తీరా కాయలు కాయక నష్టపోయాడు. తాను నకిలీ నారుతో నష్టపోయాయని గ్రహించిన ఆ రైతు తాను నారు కొనుగోలు చేసిన నర్సరీ యజమానిని అప్పట్లో నిలదీశాడు. దీంతో నర్సరీ నిర్వాహకుడు తనకు టమాట విత్తనాలు అమ్మిన కంపెనీ దృష్టికి తీసుకెళ్లి సమస్యను నివేదించాడు. దీంతో వ్యవహారం పెద్దది కాకుండా ఉండేందుకు ఆ కంపెనీ నుంచి బాధిత రైతుకు సాగుకు అయిన ఖర్చును నర్సరీ యజమాని ఇప్పించాడు. ఇప్పుడు నారుకు ఉన్న డిమాండ్ దృష్ట్యా నకిలీ నారు అంటగట్టి రైతన్నలను నర్సరీలు దగా చేయకుండా చూసేదెవరనేది ప్రశ్నార్థకం.

నర్సరీలపై పర్యవేక్షణేదీ?

మండలంలో 20–25 వరకు నర్సరీలు ఉన్నాయి. వీటికి రిజిస్ట్రేషన్ ఉందా, లేదా? ప్రమాణాల మేరకు విత్తనాలు, వివిధ పంటల నారును విక్రస్తున్నారా? అనేది సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపించింది. కొందరు నకిలీ నారును విక్రయిస్తున్నారనే సమాచారం తెలిసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలొస్తున్నాయి. ఇకనైనా అధికారులు దీనిపై దృష్టి సారించి నకిలీ విత్తనాల నారుకు చెక్ పెట్టాల్సిన అవసరం ఉంది.

10 ఎకరాల్లో సాగు చేస్తా



ప్రతి సంవత్సరం సీజన్‌లో టమాట నారు కోసం ముందే రిజర్వు చేసుకుంటున్నాం. జనవరి నుంచి జూలై వరకు దశల వారీగా 10 ఎకరాల్లో టమాట సాగు చేస్తాను. కొత్తరకం వంగడాలపై ప్రభుత్వం రైతులకు అవగాహన కల్పించి అధిక దిగుబడులు సాధించేలా చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

–రంగనాథ్, రైతు, కాటిపేరి

నకిలీల బెడద



సీజనులో చుట్టు పక్కల నర్సరీల నుంచే కాకుండా బయటి ప్రాంతాల నుంచి టమాట నారు కొనుగోలు చేయాల్సి వస్తోంది. కొత్తరకం మార్కెట్‌లోకి వచ్చిందంటూ రైతులకు నర్సరీ నిర్వాహకులు చెప్పి మోసం చేస్తున్నారు. లక్షలు ఖర్చుచేసి పంటలు సాగు చేస్తే తీరా పంట దిగుబడి రాకుంటే రైతులు ఏమి కావాలి?

–గంగిరెడ్డి, రైతు, కొలింపల్లె

అధికారులు నిఘా ఉంచాలి



టమాట నారు విక్రయించే నర్సరీలపై అధికారులు నిఘా ఉంచడంతోపాటు పర్యవేక్షణ అవసరం. రైతులు నకిలీ విత్తనాలు, నారుతో నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత వారిపై ఉంది. నర్సరీల నిర్వహణ, రిజిస్ట్రేషన్‌పై ఆరా తీసి ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాల్సి ఉంది.

–రమణారెడ్డి, రైతు, కొండామర్రి

సెమినార్ పోస్టర్ల ఆవిష్కరణ



జాతీయ సదస్సు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండ్రోజుల జాతీయ స్థాయి సదస్సు సోమవారం మొదలైంది. 'ఎంపవరింగ్ ఉమెన్–ప్రమోటింగ్ ఇన్నోవేషన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్' అనే అంశంపై ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ రీజినల్ సెంటర్ ఆధ్వర్యంలో సదస్సు మొదలైంది. దీనికి సంబంధించి పోస్టర్లను స్థానిక డీఎస్పీ ప్రభాకర్, అధ్యాపకులు ఆవిష్కరించారు.

రైతులకు పెట్టుబడి సాయమేదీ?

పుంగనూరు: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలో ఇచ్చిన మేరకు ప్రతి రైతురూ రూ.20 వేలు ఆర్థిక సహాయం చేయాలని ఎస్‌డీపీఐ కార్యదర్శి యూసుఫ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం ప్రతి ఏటా పంటల సాగుకు రైతుభరోసా పంపిణీ చేసిందని, కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ×అన్నదాతా సుఖీభవ₹ పేరిట ఇస్తామన్న పెట్టుబడి సాయం రైతులకు ఇంతవరకు ఇచ్చిన పాపానపోలేదని విమర్శించారు. రైతులు అప్పులతో వ్యవసాయం చేసి నష్టపోతున్నారని, ఇకనైనా పెట్టుబడి సాయాన్ని వారి ఖాతాల్లో జమ చేయాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో రైతుల పక్షాన నిలబడి ఎస్‌డీపీఐ ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

28న మున్సిపల్ సమావేశం

పుంగనూరు: మున్సిపల్ సమావేశం ఈనెల 28న ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు చైర్మన్ అలీమ్‌బాషా సోమవారం తెలిపారు. సమావేశంలో బడ్జెట్ ప్రవేశపెట్టి, వివిధ అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. అన్నిశాఖల అధికారులు, సభ్యులు హాజరు కావాలని కోరారు.

దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాలు

- కడా పీడీ వికాస్ మర్మత్



కృత్రిమ అవయవాలకు అర్హత పొందిన వారికి సర్టిఫికెట్లు ఇస్తున్న కడా పీడీ

కుప్పం: ప్రభుత్వం దివ్యాంగులకు, వయోవృద్ధుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తుందని కడా ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ అన్నారు. సోమవారం బాలుర ఉన్నత పాఠశాలలో ఉచితంగా ఉపకరణాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం సహకారంతో అలూమికి సంస్థ సౌజన్యంతో దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాలు పంపిణీ చేస్తున్నామన్నారు. వయోవృద్ధులు, దివ్యాంగులను సదరన్ క్యాంపుల్లో పరీక్షలు నిర్వహించి వైద్యులు ఇచ్చే సర్టిఫికెట్ల ఆధారంగా ఉచితంగా కృత్రిమ అవయవాలు పంపిణీ చేయనున్నట్లు ఆయన చెప్పారు. నియోజకవర్గంలోని అవసరమున్న దివ్యాంగులందరికీ అవసరమైన కృత్రిమ అవయవాలు, వినికిడి యంత్రాలు, మూడు చక్రాల సైకిల్, వాకింగ్ స్టిక్స్ వంటి ఉపకరణాలను పంపిణీ చేస్తామని, ప్రభుత్వం నిర్వహిస్తున్న దివ్యాంగుల క్యాంపులో ప్రతి ఒక్కరూ పాల్గొని సర్టిఫికెట్లు పొందాలన్నారు. ఈ సర్టిఫికెట్ల ఆధారంగా ఉపకరణాలు అందజేస్తామన్నారు. కుప్పం, గుడుపల్లె మండలాల్లో జరిగిన ఈ శిబిరాల్లో 815 మంది హాజరు కాగా 615 మందికి కృత్రిమ ఉపకరణాలు అవసరమని గుర్తించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, ఆర్డీఓ శ్రీనివాసరాజు, ఎంపీడీఓ సాయిలహరి, కమిషనర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో బాస్కెట్ బాల్ కోర్టు ప్రారంభం



డిగ్రీ కళాశాలలో బాస్కెట్ బాల్ కోర్టు ప్రారంభిస్తున్న డీఎస్పీ ప్రభాకర్

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వేసిన బాస్కెట్‌బాల్ కోర్టును స్థానిక డీఎస్పీ డేగల ప్రభాకర్ సోమవారం ప్రారంభించారు. దీన్ని పట్టణానికి చెందిన శ్రీపురం సీతారామయ్య కుమార్తె సురేఖ, కిశోర్ కుమార్ రూ.1.50లక్షలతో నిర్మించారు. దాతలకు కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీపీడీసీ సభ్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు పతకాల పంట



పతకాలు సాధించిన విద్యార్థులతో అధ్యాపక బృందం

కుప్పం రూరల్: తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో నిర్వహించిన అంతర విశ్వవిద్యాలయాల పాలిటెక్నిక్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ విభాగంలో కుప్పం పాలిటెక్నిక్ విద్యార్థులు పతకాల పంట పండించారు. మొత్తం 13 పతకాలు సాధించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ జగన్నాథరావు తెలిపారు. ఇందులో 3 బంగారు, 4 రజత, 6 కాంస్య పతకాలు ఉన్నట్లు చెప్పారు. 1500 పరుగు పందెంలో డి.కార్తీక్, జావెలిన్ త్రోలో జీ.కార్తీక్, బాల్ బ్యాడ్మింటన్ టీమ్ విభాగంలో బంగారు పతకాలు సాధించినట్లు చెప్పారు. షేక్ రోహిత్ లాంగ్‌జంప్, హైజంప్, ట్రిపుల్ జంప్ విభాగాల్లో ,ఆర్‌కె. జగన్ మోహన్ చెస్‌లో రజత పతకాలు సాధించినట్లు వివరించారు. మరో ఆరు విభాగాల్లో కాంస్య పతకాలు సాధించారని, మొత్తంగా 6 విభాగాల్లో రాష్ట్రస్థాయి పోటీలకు సైతం ఎంపిక కావడం కళాశాలకు గర్వకారణమన్నారు. విద్యార్థులకు తోడ్పాటు అందించిన అధ్యాపకులు జీఎస్. రమేష్, సుజాత, శోభనాద్రిని ప్రిన్సిపల్, అధ్యాపకులు సోమవారం అభినందించారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ కేంద్రం ప్రారంభం



మున్సిపాలిటీలో కూరగాయల కేంద్రం ప్రారంభంలో ఏడీ శివకుమార్, రైతులు

పుంగనూరు: మున్సిపల్ ప్రాంగణంలో ప్రతి సోమవారం ప్రకృతి ఉత్పత్తుల విక్రయాలు నిర్వహించనున్నట్లు ఏడీ శివకుమార్ తెలిపారు. సోమవారం మున్సిపాలిటీలో కూరగాయల విక్రయ కేంద్రాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలలో సహజసిద్ధమైన ఎరువులతో పండించిన కూరగాయలు, జొన్నలు, కొర్రలు, సజ్జలు, ఉలవలు, బియ్యం, రాగులు, ఆకుకూరలు మొదలైన వాటిని ఇక్కడ విక్రయిస్తున్నట్లు తెలిపారు. తద్వారా రైతులను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. సహజసిద్ధంగా పండించిన ఆహారోత్పత్తులే ఆరోగ్యానికి మేలని, అందుకే వీటిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు మున్సిపాలిటీలో కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు దీనిని ఆదరించి రైతులకు చేయూతనివ్వాలని కోరారు.



గుడుపల్లె: స్టాల్‌లో కూరగాయలను అందజేస్తున్న తహసీల్దార్ సీతారాం

గుడుపల్లెలో..

గుడుపల్లె: రైతులు ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయలు ఆరోగ్యానికి మంచిదని, వీటిని ఆదరించి రైతులను ప్రోత్సహించాలని తహసీల్దార్ సీతారాం కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ కూరగాయల స్టాల్‌ను ఏర్పాటు చేసి విక్రయించారు. ఈ స్టాల్‌ను ప్రారంభించి తహసీల్దార్ మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపి, ప్రజలకు ఆరోగ్యకరమైన కూరగాయలను అందివ్వాలన్నారు. ప్రజలు కూడా తాము రోజూ ఆహారంలో స్వీకరించే వంటల్లో కూరగాయాలు రసాయన ఎరువులతో పండించారా, సేంద్రియ ఎరువులతో పండించారా? అనే దానిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి సోమవారం ప్రకృతి వ్యవసాయ కూరగాయల స్టాల్‌లో విక్రయాలు ఉంటాయన్నారు.

అన్నదాతలపై దమనకాండ దుర్మార్గం



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న రైతు సంఘ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్: దేశానికి వెన్నెముక లాంటి అన్నదాతలపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న దమనకాండ దుర్మార్గమని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రామానాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ సంఘం నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వం దమనకాండ నిర్వహించడం దుర్మార్గమన్నారు. ఢిల్లీ సరిహద్దుల్లో అరెస్టు చేసిన రైతులను బేషరతుగా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యవర్గ సభ్యులు జనార్దన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతు ఉద్యమానికి తలొగ్గి గతంలో రైతాంగ వ్యతిరేక నల్ల చట్టాలను రద్దు చేసిందన్నారు. ప్రస్తుతం వాటిని మరో రూపంలో తీసుకొచ్చేందుకు ప్రయత్నించడం శోచనీయమని విమర్శించారు. ధర్నాలో నాయకులు ఉమాపతి నాయుడు, వీసీ.గోపినాథ్, మణి, దాసరి చంద్ర, విజయ్ గౌరి, రమాదేవి, జమిలా బి, కుమారి, వీ.దామోదరం, మనోజ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోయకొండ రోడ్డును బాగు చేయండి మహాప్రభో..!



లద్దిగం కొత్తరోడ్డు క్రాసు నుంచి గుంతలమయమై ప్రమాదకరంగా మారిన బోయకొండ రోడ్డు

చౌడేపల్లె: గుంతలమయమైన బోయకొండ రోడ్డును బాగు చేయాలని భక్తులు, ప్రజలు కోరుతున్నారు. బోయకొండ గంగమ్మ దర్శనార్థం వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది వందలాది వాహనాల్లో నిత్యం వస్తుంటారు. అధిక సంఖ్యలో కర్ణాటక రాష్ట్రం నుంచి రావడం పరిపాటి. పుంగనూరు–చౌడేపల్లె ప్రధాన రహదారి నుంచి లద్దిగం కొత్త రోడ్డు క్రాసు నుంచి కరణంవారిపల్లె మీదుగా కొలింపల్లె క్రాసు నుంచి బోయకొండకు వెళ్లాల్సి ఉంది. ఈ మార్గం సింగిల్ రోడ్డు కావడంతోపాటు రోడ్డు గుంతలమయం కావడంతో వాహనదారులకు



ఇబ్బందులు తప్పడం లేదు. ఏమాత్రం ఆదమరచినా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి రోడ్డును బాగుచేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బురుజులు.. చరిత్రకు నిలువెత్తు ఆనవాళ్లు

- శత్రు దుర్భేద్యంగా పురాతన కట్టడాలు
- బందిపోట్ల నుంచి రక్షణకు, బంగారు దాచేందుకు వీటి వినియోగం
- పలమనేరు ప్రాంతంలో ఇప్పటికీ పటిష్టంగా ఉన్న వైనం



గంగవరం మండలంలోని దండపల్లె కురప్పల్లె బురుజు

పలమనేరు: రష్యా–ఉక్రెయిన్, ఇజ్రాయెల్–హమాస్ నడుమ యుద్ధం సందర్భంగా పలువురు బంకర్లలో తలదాచుకోవడం ఈ మధ్య చూశాం. కానీ ఇప్పటి బంకర్ల తరహాలో గతంలోనే మన దేశంలో బురుజుల నిర్మాణాలు జరిగాయి. అయితే బంకర్లు భూమి లోపల ఉండగా బురుజులు భూమిపైన, అటవీ ప్రాంతాలు, ఎత్తైన గుట్టల వద్ద నిర్మించారు. నాటి రోజుల్లో దండయాత్రలు చేసే రాజుల నుంచి రక్షణ కోసం, గ్రామాలపై పడి దొంగతనాలు చేసే బందిపోట్ల నుంచి కాపాడుకునేందుకు వీటిని నిర్మించినట్టు తెలుస్తోంది. పలమనేరు నియోజకవర్గంలోని గంగవరం మండలంలో దండపల్లె కురప్పల్లె, తాళ్లపల్లెతోపాటు మరికొన్ని చోట్ల ఇలాంటి బురుజులు ఇప్పటికీ చెక్కుచెదరకుండా చరిత్రకు సజీవ సాక్ష్యంగా ఉంటున్నాయి.

బంగారాన్ని బురుజుల్లో దాచేవారట..!

అప్పట్లో బందిపోట్లు గ్రామాలపై పడి విచ్చలవిడిగా దోచుకునేవారట. మహిళపై విచక్షణారహితంగా ప్రవర్తించడమే గాకుండా వారివద్ద నున్న ఆభరణాలను అపహరించుకెళ్లేవారు. రాత్రి పూట ముసుగులు ధరించి గుర్రాలపై వచ్చి గ్రామాలపై బందిపోట్లు పడేవారట. వీరిని అడ్డుకున్న వారిని అక్కడికక్కడే హతమార్చేవారు. వీరి బారి నుంచి కాపాడాలని ప్రజలు రాజులకు మొరపెట్టుకోగా రాతి బండలతో పటిష్టంగా బురుజు నిర్మించినట్టు చరిత్ర చెబుతోంది. బందిపోట్లు దివిటీలను పట్టుకుని గ్రామాల్లోకి వచ్చేటపుడు కొంత దూరం నుంచే వారి రాకను పసిగట్టి గ్రామస్తులు ఇళ్లలో వున్న ఆభరణాలు, వస్తువులు, నగదు ఈ బురుజుల్లో దాచిపెట్టేవారని గ్రామానికి చెందిన వృద్ధులు తరతరాలుగా వస్తున్న గాథలను చెబుతున్నారు. శతాబ్దాల నాటి బురుజులు ఇప్పటికీ పటిష్టంగా కనిపిస్తున్నాయి.

నేలమాళిగలు సైతం..!

బురుజులోకి వెళ్లి ముఖద్వారాన్ని బంద్‌చేస్తే ఆపై ఎవరూ లోనికి వెళ్లలేని రీతిలో వాటి నిర్మాణం ఉండటం విశేషం! బురుజులోపల ఎన్నో రహస్య ప్రదేశాలున్నాయి. కింది భాగంగా నిర్మాణం (అండర్‌గ్రౌండ్) ఉందనే విషయం ఎవరికీ తెలియదు. శత్రువులు లేదా దొంగలు లోనికి చొరబడితే వారిని సంహరించేందుకు పైభాగంలో రాతిబండలు కిందికి పడేలా టెక్నిక్స్ వాడటం చూస్తే ఔరా అనిపించక మానదు. వీటిని పురావస్తు సంపదగా పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉంది.

బాధలు చెప్పాం.. దయ చూపండి మీరే..

- పలు సమస్యలపై అర్జీలు ఇచ్చిన బాధితులు
- వినతులు స్వీకరించిన జాయింట్ కలెక్టర్ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్: అయ్యా వినతులు ఇస్తున్నాం.. పరిష్కారం చూపండి అంటూ పలువురు ప్రజలు అధికారులను వేడుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ, జాయింట్ కలెక్టర్ విద్యాధరి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో పలువురు ప్రజలు తమ ఆవేదన ఇలా విన్నవించుకున్నారు.



వృద్ధురాలి సమస్యను ఆలకిస్తున్న జాయింట్ కలెక్టర్ విద్యాధరి

మా భూమిని అగ్రవర్ణాల వారు కబ్జా చేస్తున్నారు



వెంకటలక్ష్మి, రామకృష్ణ

తమ భూమిని అగ్రకులస్తులు కబ్జా చేస్తున్నారని చౌడేపల్లె మండలం దిగువపల్లె పంచాయతీ మోట్లపల్లె యానాది కాలనీ వాసులు తెలిపారు. ఆ కాలనీకి చెందిన వెంకటలక్ష్మి, రామకృష్ణ మాట్లాడుతూ 20 ఏళ్ల కిందట 3 ఎకరాల 40 సెంట్ల ప్రభుత్వ భూమిని భూ పంపిణీలో అందజేశారన్నారు. ఆ భూమికి ప్రభుత్వం పట్టాలు సైతం అందజేసినట్లు తెలిపారు. అయితే మూడు రోజుల క్రితం అగ్ర కులస్తులు వచ్చి తమ భూమిని కబ్జా చేసుకునేందుకు ప్రయత్నించారన్నారు. ఆ భూమిలో తాము బోరు వేసుకుని మామిడి చెట్లు పెట్టుకుని వ్యవసాయం చేసుకుంటున్నట్లు చెప్పారు. కబ్జాదారులు పోలీసులను పంపి బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

దారి లేకుండా చేస్తున్నారు



నేను వి.కోట మండలం కుంబార్లపల్లి నుంచి వచ్చాను. నా తండ్రి శ్రీరామప్ప పేరిట మా గ్రామంలో సర్వే నంబర్ 82/3బిలో 1.5 ఎకరాల భూమి ఉంది. ఆ భూమికి ఆనుకుని ఉన్న రస్తా పోరంబోకు స్థలంలో ఒక వ్యక్తి అక్రమంగా కంచె వేయడమే కాకుండా నా స్థలానికి వెళ్లేందుకు దారి లేకుండా ఇబ్బందులు సృష్టించి బెదిరిస్తున్నాడు. అధికారులు పరిశీలించి న్యాయం చేయండి.

–సుబ్రహ్మణ్యం, అర్జీదారుడు, వి.కోట మండలం